క్లుప్తంగా

వర్షాధార పంటల సాగుపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్

కోవెలకుంట్ల: వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటల సాగు చేసుకునేలా అవగాహన కల్పించాలని ఏడీఏ సుధాకర్ సూచించారు. గురువారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురియకపోవడంతో ఎస్సార్బీసీ, కేసీ కెనాల్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు అందే ఆస్కారం లేదన్నారు. మినుము, పెసర, పొద్దుతిరుగుడు తదితర పంటల సాగుకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందని, వర్షాధార పంటల సాగు చేపట్టాలని సూచించారు.

గ్రంథాలయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాఘవరెడ్డి



కోవెలకుంట్ల: గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోవెలకుంట్ల లైబ్రేరియన్ రాఘవరెడ్డిని ఎన్నుకున్నారు. గురువారం ఆ సంఘం రాష్ట్ర స్థాయి నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోగా రాఘవరెడ్డికి చోటు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధితోపాటు ఉద్యోగుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

సహాయ కార్యదర్శిగా బషీర్ ఆహమ్మద్



బనగానపల్లె: గ్రంథాలయ ఉద్యోగుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా బనగానపల్లె లైబ్రేరియన్ జలాల్ బషీర్‌అహమ్మద్ ఎన్నికయ్యారు. అదేవిధంగా రాయలసీమ ప్రాంతీయ అసోసియేట్ అధ్యక్షుడిగా బేతంచర్ల మండల గ్రంథాలయ అధికారి మధుశేఖర్, రాయలసీమ ప్రాంతీయ కార్యదర్శిగా డి.మధునాయుడు ఎన్నికయ్యారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్లు

బనగానపల్లె: బనగానపల్లె నియోజకవర్గంలోని 25 అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులకు రూ.1.20 కోట్లు మంజూరైందని పంచాయతీరాజ్ డీఈఈ నాగశ్రీనివాసులు తెలిపారు. బనగానపల్లె, కొలిమిగుండ్ల మండలాల్లో 20 అంగన్‌వాడీ కేంద్రాలు, కోవెలకుంట్లలో నాలుగు, సంజామల మండలం ఒక కేంద్రం అభివృద్ధి పనులకు ఈ నిధులు మంజూరయ్యాన్నారు. అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభిస్తామని డీఈఈ తెలిపారు.

నీటి విడుదల విజయవంతం

బనగానపల్లె: పట్టణంలోని రవ్వలకొండ, ఎన్జీవో కాలనీలో ఒక్కొక్కటి 2.50 లక్షల లీటర్ల సామర్థ్యంలో చేపట్టిన ఓహెచ్‌సీ ట్యాంకుల నిర్మాణాలు పూర్తయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ ఉమాకాంత్‌రెడ్డి తెలిపారు. వీటి ద్వారా పైపులైన్ల నుంచి పట్టణంలోని కుళాయిలకు నీటిని విడుదల చేపట్టగా విజయవంతమైందన్నారు. త్వరలో వీటి ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని, పట్టణంలో తాగునీటి సమస్య ఉండదన్నారు.

నేడు ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

డోన్ టౌన్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడవ శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు డోన్ డిపో మేనేజర్ శశిభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయత్రం 5గంటల వరకు గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యోగస్తులు తమ సమస్యలు తెలిపితే పరిష్కారం కోసం వెబ్ సైట్ ద్వారా వీసీ, ఎండీకి పంపుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

శ్రీనివాస ఏజెన్సీ తనిఖీ

అవుకు: పట్టణంలోని శ్రీనివాస ఏజెన్సీని గురువారం అబ్దుల్ హక్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువు ల నమూనాలను సేకరించి విశ్లేషణకు తరలించారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు, వి త్తనాలు అధిక ధరలకు విక్రయించినా, నాణ్యతాలోపం ఉన్నా దుకాణాల నిర్వాహకులపై చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఏఓ హెచ్చరించారు.

సన్మానం

డోన్ టౌన్ : పట్టణంలోని పాతపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను గురువారం హెచ్ఎం వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. వెంకటేశ్వర్‌గౌడ్, శ్రీకళ, రాఘవేంద్ర, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌గౌడ్‌కు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటరమణ, మధుసూదనరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రవిశేఖర్, వెంకటలక్ష్మి, రాధ, అనంత శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెలోనే పంటి వైద్యం

- ప్రాథమిక ఆసుపత్రుల్లో ఓరల్ క్లీనింగ్ పరీక్షలు
- ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తింపు
- డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో అన్నిరకాల దంత పరీక్షలు



దంత చికిత్స చేస్తున్న ప్రభుత్వ వైద్యురాలు

డోన్ : గ్రామస్థాయిలో ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. వైద్య చికిత్సల కోసం చీటికి, మాటికి పట్టణాలకు వెళ్లకుండా ప్రజల వ్యయప్రయాసలను తగ్గించింది. గ్రామీణ స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఇప్పటికే వైద్యసేవలు అందిస్తున్న సంగతి అందరికీ తెలుసు. దీనికితోడు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటింటికీ డాక్టర్ వెళ్లి వైద్యం చేసే విధానాన్ని అమలుచేస్తోంది. వాటితో పాటు డెంటల్ క్లినిక్ నిర్వహణ కూడా పీహెచ్‌సీలలో సమర్థవంతంగా వైద్యులు నిర్వహిస్తున్నారు.

నోటి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

చిన్నచిన్న దంత సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి దీర్ఘకాలిక పెద్ద సమస్యలుగా మారుతున్నాయి. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి సరైన వైద్యచికిత్స అందించకపోతే నోటి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డోన్ ఆసుపత్రిలోని దంత వైద్యశాలలతో పాటు కర్నూలు సర్వజన వైద్యశాలలో నోటి క్యాన్సర్ నిర్ధారించేందుకు అధునాతన వెల్‌స్కోప్ పరికరాలను ప్రభుత్వం ఇప్పటికే సమకూర్చింది.

ప్రాథమిక దశలోనే సమస్యల గుర్తింపు

పీహెచ్‌సీలలో నిర్వహిస్తున్న డెంటల్ క్లినిక్ ద్వారా గుర్తించబడిన దంత సమస్యలను నివారించడానికి వైద్య విధాన పరిషత్ వైద్యులు ఓరల్ స్క్రీనింగ్ అనే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చిన వైద్యులను పీహెచ్‌సీలకు నియమించారు.

డోన్ సీహెచ్‌సీలో అన్ని రకాల దంత వైద్య సేవలు

స్థానిక వందపడకల ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన దంత వైద్యశాలలో రోగులకు అన్నిరకాల దంత వైద్య సేవలు లభిస్తున్నాయి. ఒక్క పళ్ల అమర్చడం మినహా అన్నిరకాల సేవలు రోగులకు అందుబాటులో ఉన్నాయి. డెంటల్ ఫుల్లింగ్, సిమెంట్ కేరింగ్, పుచ్చిపోయిన పళ్లను పీకడం, దంతక్షయ నివారణ కోసం క్లీనింగ్ చేయడం లాంటి సేవలు అందిస్తున్నారు. దీంతో దంత సమస్యలు ఉన్నవారు ప్రభుత్వ దంత వైద్యశాలను ఆశ్రయిస్తూ చికిత్స పొందుతున్నారు. రోజుకు 15 నుంచి 20 మంది వరకు దంత సమస్యలతో బాధపడేవారు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తుంటారు.

ఆధునిక వైద్యం అందుబాటులో



డోన్ సీహెచ్‌సీలోని దంత వైద్యశాలలో అన్నిరకాల దంత సమస్యలకు చికిత్స అందిస్తున్నాం. ప్రైవేటు వైద్యులను సంప్రదించి డబ్బులు వృథా చేసుకోకుండా ప్రభుత్వాసుపత్రిలో సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ యమునాకుమారి, దంత వైద్యురాలు, ప్రభుత్వాసుపత్రి, డోన్

కరోనా సమయంలో ఆత్మ బంధువులా...



మంచానికి పరిమితమైన చాంద్‌భీకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రమేష్

ఈ చిత్రంలో మంచానికే పరిమితమైన వృద్ధురాలు షేక్ చాంద్‌బీకి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వ్యక్తి మండలంలోని గుండాల గ్రామానికి చెందిన వలంటీర్ కొర్రపాటి రమేష్. తనకు కేటాయించిన గృహాల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటూ ప్రజల మన్ననలు పొందుతున్నాడు. ప్రత్యేకించి కరోనా సమయంలో వలంటీర్ సేవలను ప్రతిఒక్కరూ కొనియాడుతున్నారు. కరోనా మహమ్మారి మూలంగా బయటకు రాలేని పరిస్థితుల్లోనూ వలంటీర్లు ఇళ్ల దగ్గరికి వెళ్లి ప్రభుత్వ సాయంతోపాటు, పింఛన్ అందజేయడమే కాకుండా దాతల నుంచి సేకరించిన నిత్యావసర సరుకలు అందజేసి అండగా నిలిచారు. అదేవిధంగా ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తూ ఏ మాత్రం అనుమానం వచ్చినా వెంటనే కరోనా పరీక్షలు చేయించి మనోధైర్యాన్ని నింపారు. ఏళ్లు గడుస్తున్నా కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలను నేటికీ గుర్తు చేస్తున్నారు ఆయా గ్రామాల ప్రజలు.

కష్టకాలంలో ఆదుకున్నాడు...



కరోనా కష్టకాలంలో వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివి. నా విషయానికొస్తే వృద్ధురాలినైన తనకు మహమ్మారి సోకింది. భయం... భయంగా హోమ్ క్వారంటైన్‌లో ఉన్నా...ఒక్కగానొక్క కుమారుడికి సోకుతుందేమోనని ఓవైపు ఆందోళన. ఇలాంటి పరిస్థితులో వలంటీర్ రమేష్ ఆత్మ బంధువులా అండగా నిలిచాడు. నిబంధనలు సూచించి భయపడొద్దని...నీ కుమారుడికి ఏమీకాదని భరోసా కల్పించాడు. పింఛన్ సొమ్ము, నిత్యావసర సరుకులు అందజేసి ఆదుకున్నాడు.

- షేక్ చాంద్‌బీ ., ఎస్.గుండాల గ్రామం, డోన్ మండలం

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీరాములు

ప్యాపిలి: మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ శ్రీరాములు సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం పీర్ల చావిడుల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. వేడుకల్లో అపశృతులు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీర్ల చావిడి ముందు ఏర్పాటు చేసే అగ్ని గుండం వద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. చావిడి వద్ద ఆకతాయిలు మహిళలకు ఇబ్బందులు కలిగే పరిస్థితులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పీర్ల ఊరేగింపులో చావిడిల వద్ద ఉన్న పాత మిద్దెలపై భక్తులు ఎక్కకుండా జాగ్రత్త వహించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వృద్ధురాలికి ఇంటి వద్దనే పరీక్షలు చేస్తున్న దృశ్యం

అవుకు: ప్రజలు సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్పలపాడు పీహెచ్‌సీ కోలోకేటెడ్ వైద్యాధికారి నవీన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని మంగంపేట గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణ వ్యాధులతోపాటు గర్భిణులు, బాలింగలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, సర్పంచ్ తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి

డోన్ : ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం ప్రాథమిక వైద్యకేంద్రం అధికారి డాక్టర్ అఖిల్ సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు ఉచితంగా అందజేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు విశ్రాంతమ్మ, సాయివాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వృద్ధురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

అవుకు: ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నాడని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. అవుకు మండలం చెర్లోపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చెర్లోపల్లెకు చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి, మండల స్థాయి అధికారులతో కలిసి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అదేవిధంగా సమస్యలపై ఆరా తీశారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకొని సంక్షేమ పాలనను సాగిస్తున్నారన్నారు. ఏ చిన్న పొరపాటు మూలంగా అర్హులైన పేదలు సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే ముఖ్యమంత్రి ఉద్దేశమని, ఈ మేరకు ప్రజలను నేరుగా కలుసుకొని సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే మీ ముందుకు వచ్చామన్నారు. ఇలాంటి కార్యక్రమం ఇంతవరకు ఏ సీఎం చేపట్టలేదని గుర్తుచేశారు. ప్రతి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ ఫలాలను అందజేసారని, సంక్షేమ పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలను కోరారు.



కుళాయి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

చెర్లోపెల్లె గ్రామంలో రూ.41లక్షలతో నిర్మించిన ఎంపీయూపీ పాఠశాల ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూ.36లక్షలతో ఏర్పాటు చేసిన పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే స్వయంగా బిందెకు నీటిని పట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఏఓ అబ్దుల్ హక్, ఆర్‌డబ్ల్యూస్, పీఆర్, ట్రాన్స్‌కో, హౌసింగ్, ఏఈలు కరిముల్లా, గౌష్, పక్కీరయ్య, క్రిష్ణారెడ్డి, ఉమ్మడి జిల్లాల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గోపవరం గోపాల్ రెడ్డి, సర్పంచ్ కొమ్ముసాని మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కొమ్ముసాని చిన్న కంబగిరిస్వామి, అవుకు మండల సచివాలయ కన్వీనర్ తల్లం సుబ్రహ్మణ్యం, నాయకులు పెద్ద కంబగిరిస్వామి, శేషఫణి శెట్టి, శంకర్, పుల్లయ్య, ఈడిగ వెంకటరాముడు, ఎరికలి వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, శ్రీనివాసులు, సుబ్బయ్య, పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పౌర సేవలు



మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే పౌర సేవలు అందుతున్నాయని, ప్రజ ల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సూచించారు. మండల కేంద్రం కొలిమిగుండ్ల గ్రామ సచివాలయం-2 పరిధిలో గురువారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్మన్ 636 మందికి వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఈసందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పేదల గురించి ఆలోచిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాముడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి, జిల్లా పబ్లిసిటి వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: పట్టణంలోని మూడవ గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలోని ఆయా కాలనీల్లోని అన్ని అర్హతలు ఉండి ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు వర్తించని పేదల వివరాలను పరిశీలించారు. అధికారులతో కలిసి సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ప్రజలకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఈఓ గోపినాథ్, పశువైద్యాధికారి కృష్ణకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, ఏపీఎం గురుస్వామి పాల్గొన్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరం, చెరువుపల్లె గ్రామ సచివాయాలల్లో గురువారం అధికారులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువుపల్లె గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ శివరామయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి హాజరయ్యారు. 1,240 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎంపీడీఓతో కలిసి కాటసాని అందజేశారు. నందవరం సచివాలయ పరిధిలోని 548 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు డీటీ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ హుస్సేన్‌బీ, ఉపసర్పంచ్ అమీనాబీ, ఎంపీటీసీ లక్ష్మీ నారాయణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు అత్తార్‌జాహేద్, మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడి, బాషా పాల్గొన్నారు.

ప్యాపిలి: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం ఉచితంగా ధృవపత్రాలు జారీ చేస్తోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. మండల పరిధిలోని నేరేడుచెర్ల, పీఆర్ పల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు అనిల్ కుమార్, మహేశ్వరి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మ, ఈఓఆర్డీ బాలకృష్ణుడితో కలిసి వివిధ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు వారు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దనగట్టు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సంజామల: మండలంలోని ముదిగేడులో గురువారం అధికారులు జగన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ నాగకుమార్, తహసీల్దార్ మల్లికార్జున రావు, ముదిగేడు సర్పంచ్ అరుణమ్మ, ఎగ్గోని సర్పంచ్ అసద్‌అల్లిఖాన్‌తో కలిసి వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి 287 ధ్రువీకరణ పత్నాలను లబ్ధిదారులకు అందజేశారు.

అవుకు: మండల పరిధిలోని కునుకుంట్ల, మంగంపేటల్లో గురువారం తహసీల్దార్ శ్రీనివాసులు, ఇంచార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కునుకుంట్లలో 182 మందికి, మంగంపేటలో 307 మందికి వివిధ ధ్రువీకర ణ పత్రాలను అందజేశారు. ఈఓఆర్డీ రామక్రిష్ణవేణి, పీఓఎల్ఆర్ డీటీ శ్రీనివాసులు, ఏపీఓ అనీఫా, ఎంపీటీసీ ప్రత్యూష, సర్పంచ్‌లు తులశమ్మ, దేవిభాయి, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పేదలకు వరం అని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యులు ముర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరక్టర్ మురళీ అన్నారు. గురువారం నగర పంచా యతీ పరిధిలోని సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీ, బుగ్గానిపల్లెలోని సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, డీటీ సత్యదీప్, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ నాగజ్యోతి, మహేశ్వరీ, మధు, గ్రామ సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు. 5వ సచివాలయం పరిధిలో 840 మంది, బుగ్గానిపల్లె సచివాలయం పరిధిలో 880 మంది లబ్ధిదారులుకు వివిధ ధ్రువ పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బా బుల్ రెడ్డి, దస్తగిరి, గూని నాగరాజు, నిరంజన్, వలీబాషా, నాగరాజు, ఎద్దులన్న, తిరుమలేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డోన్: అర్హులైన ప్రతిఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక 15, 16 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కౌన్సిలర్లు మేకల విమల, ఆర్ట్ రమణ, వెంకట్రాముడు, పాలుట్ల మీనాక్షి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయా వార్డులలకు సంబంధించిన లబ్ధిదారులకు 1,070 కుల, 865 ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఆయన అందజేశారు. 15 మందికి రేషన్‌కార్డులు మంజూరు చేయడం జరిగిందని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ కుమ్మరి రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునగౌడ్, సుంకన్న, మాబు, అర్‌బిలు జాకీర్‌హుసేన్, మోహన్, శిరీష్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ ఇస్తున్న కాటసాని ఓబులరెడ్డి



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న బేతంచెర్ల ఎంపీపీ



సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్



ధ్రువీకరణ పత్రంఅందజేస్తున్న డోన్ ఎంపీపీ



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం



సర్టిఫికెట్ ఇస్తున్న వైస్ ఎంపీపీ



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్నదృశ్యం

నేటి నుండి ఓటర్ల జాబితాపై విచారణ

డోన్ : ఓటర్ల జాబితాలో తప్పులను సరిదిద్దేందుకు బూత్‌లెవల్ అధికారులతో వెరిఫికేషన్ చేయిస్తున్నట్లు ఆర్డీఓ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డోన్ నియోజకవర్గంలో 291 పోలింగ్ బూత్‌లలో బూత్‌లెవల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. వీరు ఈ నెల 21వ తేదీ నుంచి పట్టణంతో పాటు డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లోని అన్ని గ్రామాలలో ఇంటింటికీ తిరిగి అసలైన ఓటర్లను గుర్తించే కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జాబితాలో అర్హులై ఉండి పేర్లు లేనివారు, పేర్ల నమోదుకు బూత్‌లెవల్ అధికారులను సంప్రదించాలన్నారు. మృతులు, దూరప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకున్న వారి పేర్లను తొలగించేందుకు బూత్‌లెవల్ అధికారులతో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో గురువారం ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బత్తుల సుబ్బరాయుడు కుమారుడు శివశంకర్(25) జీవి చెట్ల సమీపంలోని బస్టాప్ వద్ద నడిచివెళుతున్నాడు. అదే సమయంలో బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తాడిపత్రి నుంచి వస్తూ యుకుడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ రమేష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

క్షుద్ర పూజల కలకలం

అవుకు: పట్టణ సమీపంలోని కొండల్లో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన క్షుద్ర పూజలు దృశ్యం గురువారం కలకలం రేపింది. చిన్న చెరువు సమీపాన ముగ్గుపాడితో ఓ ఆకారాన్ని చేసి అందులో కుంకుమ, పసుపు, నిమ్మకాయలు, ఉల్లిగడ్డలు, కత్తి, కోడిగుడ్డు, పెరుగుతో పాటు ఓ నల్లకోడిని బలి చేశారు. ఉదయం ఆ ప్రాంతానికి వెళ్లిన కొందరు వ్యక్తులు ఈ ఆనవాళ్లను చూడడంతో విషయం బయటపడింది. మూడురోజుల కిందట అమావాస్య రోజు క్షుద్రపూజలు చేసింటారని కొందరు, దెయ్యాలను విడిపించటానికి చేసి ఉంటారని మరి కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

యంబాయి గ్రామంలో చోరీ

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయిలో చోరీ జరిగినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివ శంకర్ నాయక్ వివరాల మేరకు బోయ లక్ష్మిదేవి, రవి తమ కుమార్తె మధులతను నంద్యాలలో హాస్టల్ వదిలి పెట్టేందుకు ఈనెల 18న వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉంది. బీరువాల్లో ఉన్న రూ.50 వేల విలువ 2జతల బంగారు కమ్మలు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుక వెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురంలో నల్లబోతుల వెంకట్రాముడు నాటు సారా విక్రయిస్తుండగాఅదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ శివ శంకర్ నాయక్ గురువారం తెలిపారు. 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

సంజామల: మండల పరిధిలో లింగందిన్నె సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మహేష్‌పై దాడి చేసిన వ్యక్తికి జడ్జి 12 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ప్రతాప్ తెలపారు. బుధవారం మహేష్‌పై దాడి చేసిన వ్యక్తి మద్దిరాల శేఖర్‌ను గురువారం బనగానపల్లె న్యాయమూర్తి ఎదుట హాజరు పరుచగా రిమాండ్ విధించారన్నారు. ఈ మేరకు ఆళ్ళగడ్డ సబ్ జైల్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అవుకు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఇరువర్గాలపై గురువారం కేసులు నమోదు చేసామని ఎస్ నరేంద్ర కుమార్ తెలిపారు. చెక్కా రంగయ్య, అదే గ్రామానికి చెందిన నూనేపల్లె శ్రీ రామ మద్దిలేటిల మధ్య ఇంటి ఎదుట కట్టుకునే మెట్ల విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ మేరకు బుధవారం ఇరువర్గాల మధ్య గడవ జరిగింది. చెక్కా రంగయ్యకు, నూనెపల్లె శ్రీరామ మద్దిలేటిలకు గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలకు చెందిన పదిమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.